AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
24-8-2026 (Monday) MAIN EDITION

## ఏపీకి చికెన్ వ్యర్థాల తరలింపు




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా చికెన్ వ్యర్థాల తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. చేపల దాణాగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దాదాపు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఆ వాహనాలను ఠాణాకు తరలించి, కేసు నమోదు చేశారు.

## హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తా




**అక్షరటుడే, సిద్దిపేట:** గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆయన కోరారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు.

## 22ఏ బాధితులకు న్యాయం చేస్తాం



అక్షరటుడే, హైదరాబాద్ : కోర్ హైదరాబాద్‌కు 22A అంశం జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. 22A బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షం అబద్ధాలతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తోందన్నారు.

## లలితా జువెలరీ మార్ట్ సూపర్ లిస్టింగ్




అక్షరటుడే, బిజినెస్ డెస్క్: లలితా జువెలరీ మార్ట్ కంపెనీ ఐపీవో సూపర్ హిట్ అయింది. రూ. 1,700 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో ఐపీవోకు వచ్చింది. సోమవారం కంపెనీ షేర్లు మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఒక్కో షేరు ధర రూ. 201 కాగా.. 31.84 శాతం ప్రీమియంతో రూ. 265 వద్ద లిస్టయ్యింది.

## ఐపీవోకు హైడ్రాలిక్ ఫిట్టింగ్ కంపెనీ




అక్షరటుడే, బిజినెస్ డెస్క్: హైడ్రాలిక్ ఫిట్టింగ్‌లను తయారు చేసి సరఫరా చేసే హై-టెక్ ఇంజినీర్స్ కంపెనీ ఐపీవోకు వచ్చింది. ఈ కంపెనీ రూ. 135.73 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో ఐపీవోకు వస్తోంది. ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 24న ప్రారంభమైంది. ఆగస్టు 27 వరకు అందుబాటులో ఉంటుంది.

**కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దానిని దుర్వినియోగం చేస్తూ.. హద్దులు దాటి మాట్లాడితే ఉపేక్షించమని హెచ్చరించారు. మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజాపాలన ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# హద్దులు దాటితే ఉపేక్షించం



■ పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వార్నింగ్ ■ కష్టపడ్డ కార్యకర్తలకు సొసైటీ పదవులు ■ ఎస్ఐఆర్‌తో ఓటు హక్కు తొలగించే కుట్ర

మెదక్‌లోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పీసీసీ చీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, డీసీసీ అధ్యక్షులు పూజల హరికృష్ణ, మాజీ మంత్రి చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దళితుడిని అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి తొలగించిన చరిత్ర బీఆర్ఎస్‌ది అని విమర్శించారు.

### ఓటు హక్కు కాపాడుకోవాలి

మెదక్ కాంగ్రెస్ ఖిల్లాగా మారుతుందని మహేశ్ గౌడ్ అన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడి ఓటు కాపాడటం కోసం కాంగ్రెస్ నాయకులు పని చేశారని పేర్కొన్నారు. 2002 కండిషన్ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతుందని ఆయన ఆరోపించారు. నోటీసులు వచ్చిన ప్రతి ఒక్కరు వివరాలు అందజేసి ఓటును కాపాడుకోవాలని సూచించారు.

### పాతవారికి ప్రాధాన్యం

కష్టపడ్డ కార్యకర్తలకు సొసైటీల్లో పదవులు ఇస్తామని పీసీసీ చీఫ్ ప్రకటించారు. పాతవారికి పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. పార్టీని నమ్ముకున్న పాతవారికి 70 శాతంకి పైగా పదవులు వస్తాయన్నారు. మార్కెట్, సొసైటీ, టెంపుల్, లైబ్రరీ పదవుల్లో పాతవారికి (సీనియర్ నాయకులకు)మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.

### మోదీ ఇంటికే..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని మహేశ్‌గౌడ్ ఎంపీ రఘునందన్‌రావును ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. జెన్ జీ ఉద్యమం మోదీకి చెంపపెట్టు అన్నారు. మతం, కులం పేరిట రాజకీయాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన మోదీ ఇంటికే అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ నేతృత్వంలో 100 సీట్లతో అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొందరు సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కత్తి పట్టుకున్నాడు కత్తి పోటుకు పోయినట్లు.. సోషల్ మీడియాను నమ్ముకున్న కేటీఆర్ అదే గాల్లో కొట్టుకుపోతారన్నారు.

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, శంషాబాద్ :** విదేశీ పర్యటన ముగించుకొని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి లండన్, అమెరికా పర్యటన కోసం ఇటీవల బయలుదేరిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన లండన్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి తిరిగి వచ్చారు.

## ఫీజు బకాయిల కోసం బీజేపీ చీఫ్ నిరాహార దీక్ష



**అక్షరటుడే, నాంపల్లి :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నిరాహార దీక్ష చేపట్టారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో రాంచందర్‌రావు సోమవారం నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఉదయం 10 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల పాటు ఈ దీక్ష కొనసాగనుంది. ఫీజు బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఫీజుల బకాయి - బీజేపీ లడాయి పేరుతో చేపట్టిన ఈ దీక్షలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రమణారెడ్డి పాల్గొన్నారు.

## విమానాశ్రయం ప్రాజెక్ట్‌ను రద్దు చేసిన సీఎం విజయ్



**అక్షరటుడే, తమిళనాడు :** చెన్నై సమీపంలో కొత్త విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను సీఎం విజయ్ పక్కన పెట్టారు. రాష్ట్ర రాజధానికి సుమారు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న పరాందూరులోని ఎయిర్‌పోర్టు నిర్మించాలని గత డీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఆ ప్రాజెక్ట్‌ను పక్కన పెడుతున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. ఎయిర్‌పోర్టు కోసం ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తామన్నారు. దీనిపై తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో డీఎంకే సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.

## భారీగా పెరిగిన ఉల్లి ధరలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. కిలో రూ.50 దాటడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ధరలు పెరగడంతో మహారాష్ట్ర నుంచి ఢిల్లీ, చెన్నై, కొచ్చి, గౌహతి నగరాలకు రైలు మార్గం ద్వారా ఉల్లిపాయలను రవాణా చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు, ప్రభుత్వం వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని కేంద్రం పేర్కొంది. టోకు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, మహారాష్ట్రలోని తన బఫర్ నిల్వల (అదనపు నిల్వల) నుండి ప్రధాన వినియోగ కేంద్రాలకు ఉల్లిపాయలను తరలించేందుకు సోమవారం నుంచి "కాందా ఎక్స్‌ప్రెస్"ను ప్రారంభించింది.



## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

**అక్షరటుడే, పంజాబ్ :** పంజాబ్, చండీగఢ్‌లో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. చండీగఢ్ సెక్టార్ 43 బస్టాండ్ సమీపంలో ముగ్గురు అనుమానితును అరెస్ట్ చేశారు. లవ్ ప్రీత్ సింగ్ (19), జషన్ ప్రీత్ సింగ్ అలియాస్ జషన్ దీప్(21), ప్రభ్ ప్రీత్ సింగ్ అలియాస్ ప్రభ్(19)ను అదుపులోకి తీసుకున్నారు. వీరికి బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో సంబంధాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. వారి వద్ద నుండి పేలుడు పదార్థాలు, ఒక తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిలో ఇద్దరు తరన్ తారన్.. మరొకరు అమృత్‌సర్ కు చెందినవారిగా గుర్తించారు.

## మత మార్పిడులను ప్రోత్సహించిన జగన్

**అక్షరటుడే, ఏపీ :** మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ మత మార్పిడులను ప్రోత్సహించారని ఆరోపించారు. హిందువుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో వందల చర్చిలు కట్టడానికి ఆయన ప్రోత్సహించారన్నారు. ఏఈ నూకరాజ్ కుటుంబం హత్య కేసులో నిందితుడు సాదిక్ టెర్రరిస్ట్ అని విజయ సాయిరెడ్డి ఆరోపించారు. జగన్ భవిష్యత్‌లో కాంగ్రెస్‌లో జతకట్టే అవసరం వస్తుందేమోనని, ఈ విషయం గురించి మాట్లాడటం లేదన్నారు. తనకు బీజేపీలో చేరే ఆలోచన లేదని మాజీ ఎంపీ స్పష్టం చేశారు. కొత్త పార్టీపై త్వరలోనే చెప్తానన్నారు.



## భారీగా గంజాయి పట్టివేత




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** త్వరగా డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో ఒక 'బ్లింకిట్' డెలివరీ రైడర్ గంజాయి సరఫరా మార్గాన్ని ఎంచుకున్నాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటల పాలయ్యాడు. బ్లింకిట్‌లో డెలివరీబాయ్‌గా పని చేస్తున్న వ్యక్తికి తన స్నేహితుడు శివ గంజాయి రవాణాతో భారీగా డబ్బులు సంపాదించవచ్చని చెప్పాడు. దీంతో అతడు ఒప్పుకున్నాడు. ఇద్దరు కలిసి విశాఖపట్నం నుండి న్యూఢిల్లీకి రూ. 24.5 లక్షల విలువైన 48 కిలోల గంజాయిని తరలించాలని ప్లాన్ వేశారు. ఈ మేరకు గంజాయి తీసుకొని హైదరాబాద్ వరకు వచ్చారు. ఇక్కడకు వచ్చాక శివ అతడిని మోసం చేశాడు. ఇప్పుడే వస్తానని చెప్పి పారిపోయాడు. దీంతో గంజాయితో ఒంటరిగా ఉన్న అతడు పోలీసులకు దొరికాడు.

## రానున్న 72 గంటలు వర్ష సూచన

**అక్షరటుడే, హైదరాబాద్ :** అల్ప పీడన ప్రభావంతో ఆదివారం నుంచి రాష్ట్రంలో వానలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున నుంచే ముసురు పెట్టింది. నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు 27 వరకు వర్షాలు పడుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానలు పడుతాయన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి.

